## క్లుప్తంగా

### ఎమ్మెల్యే పరామర్శ



కోటేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వనమా

సుజాతనగర్: సుజాతనగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు బానోత్ కోటేష్‌ను ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు శనివారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటేష్ గాయపడి వైద్యం పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుజాతనగర్‌లోని కోటేష్ ఇంటికి వెళ్లి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదం ఎలా జరిగిందని అడిగి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### నర్సరీలో మొక్కలపై శ్రద్ధ తీసుకోండి

పాల్వంచరూరల్: మండుతున్న ఎండలకు నర్సరీలోని వివిధ రకాల మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందిని ఎంపీడీఓ బి.అప్పారావు ఆదేశించారు. మండల పరిధి దంతలబోరు, దంతలబోరు ఎస్సీకాలనీ, నారాయణరావుపేట గ్రామపంచాయతీలోని నర్సరీలను శనివారం ఎంపీడీఓ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ, కార్యదర్శులతో మాట్లాడారు. నర్సరీలో మొక్కలకు ఉదయం, సాయంత్రం నీళ్లు పెట్టి సంరక్షించాలని సూచించారు. నర్సరీల్లో మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు.

### సిలువల తొలగింపు సరికాదు..

పాల్వంచ: చర్చిపై సిలువను అధికారులే తీసివేయడాన్ని ఖండిస్తున్నామని పాల్వంచ మండల క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఎం.జాన్ విల్సన్, సెక్రటరీ ఎస్.ప్రేమ్‌దాస్ అన్నారు. శనివారం స్థానిక ఎల్‌జీఎం చర్చిలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి పంచాయతీలో సిలువ సహవాస మందిరాన్ని పట్టాభూమిలో అక్కడి సర్పంచ్, పెసా (పంచాయతీ ఎక్స్‌టెన్షన్ షెడ్యూల్డ్ ఏరియా) చట్టం కమిటీ లిఖిత పూర్వక అనుమతితో నిర్మించడం జరిగిందన్నారు. దీనిపై కొందరు వారి వ్యక్తిగత స్వార్థం కోసం విషం చిమ్ముతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు.. సిలువలను తొలగించి క్రైస్తవుల మనోభావాలు దెబ్బతీశారని, త్వరలో ప్రత్యక్ష ఆందోళనలను నిర్వహిస్తామన్నారు.

### కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెహ్రూ వర్ధంతి



నెహ్రూ విగ్రహానికి పూలమాల వేస్తున్న సీతారాములు

సుజాతనగర్: మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సుజాతనగర్‌లో ఘనంగా నిర్వహించారు. నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు మాట్లాడుతూ.. నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో అనే కార్యక్రమాలు రూపొందించి ప్రజలకు అందించినట్లు చెప్పారు. చింతలపూడి రాజశేఖర్, మడిపల్లి శ్రీనివాస్, మౌలాసాహెబ్, అజీజ్, ఖాసీం పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఇల్లెందురూరల్: రాఘబోయినగూడెం గ్రామ పంచాయతీ తంగెళ్లగడ్డ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమార్ అనే యువకుడికి తీవ్రంగా గాయాలయ్యాయి. బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ వేపలగడ్డ గ్రామానికి చెందిన కుమార్ రాఘబోయినగూడెం గ్రామం నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. తంగెళ్లగడ్డ గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కుమార్‌ను ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### వరకట్న వేధింపులపై కేసు నమోదు

ఇల్లెందు: వరకట్న వేధింపులపై శనివారం కేసు నమోదు అయింది. వివరాలు... పట్టణంలోని జేకే కాలనీ సంజయ్‌నగర్‌కు చెందిన మోతురూరి నాగ రాజేశ్వరిని ఆమె భర్త నరేష్ కొంత కాలంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. విసిగిపోయిన ఆమె పోలీసులను ఆశ్రయించింది. వడ్రంగి వృత్తి చేసుకుని జీవిస్తున్న నరేష్ తరుచూ భార్యను వేధిస్తున్నాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# స్విమ్మింగ్ పూల్.. ఆదరణ ఫుల్!

- నామమాత్రపు ఫీజుతో 'సింగరేణి' శిక్షణ
- అందుబాటులో నిపుణులైన కోచ్‌లు
- రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగిన పలువురు



ఈతకొలనులో ప్రాక్టీస్ చేస్తున్న చిన్నారులు

సండే స్పెషల్

సింగరేణి(కొత్తగూడెం): గతంలో వేసవి సెలవులు వచ్చాయంటే పిల్లలు ఇంటికే పరిమితమయ్యేవారు. ఎండ నుంచి కాపాడేందుకు ఇండోర్ గేమ్స్ ఆడించేందుకు తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇచ్చేవారు. కానీ పది నెలలు పుస్తకాలకే పరిమితయ్యే విద్యార్థులకు వేసవిలో సెలవుల్లో ఏదో ఒక అంశంలో శిక్షణ ఇప్పించాలనే తపన పెరుగుతోంది. ఈ నేపథ్యాన స్విమింగ్, పాటలు, శాస్త్రీయ నృత్యం.. ఇలా విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇదే కోవలో సింగరేణి అధికారులు ఏటా వేసవిలో నామమాత్రపు ఫీజుతో స్విమ్మింగ్ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తోంది. కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని సీఆర్ క్లబ్‌ను వేదికగా ఉన్న పూల్స్‌లో పిల్లలు, పెద్దలు, మహిళలకు వేర్వేరుగా నిపుణులైన కోచ్‌ల ద్వారా శిక్షణ ఇప్పిస్తోంది.

**స్విమ్మింగ్‌తో ఉపయోగాలు..**

శరీర దారుఢ్యానికి ఈత ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతారు. అలాగే, ప్రతిరోజూ ఈత కొడితే రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారని.. చేసే పనులపై ఏగ్రాత ఉంటుందని పేర్కొన్నారు. అలాగే, ప్రమాద సమయాల్లో తమను తాము రక్షించుకోవడమే కాక ఇతరులను కాపాడే అవకాశం ఉంటుంది.

**రోజుకు 400 మంది..**

సింగరేణి పూల్‌లో 250 మంది పిల్లలు, వంద మంది పెద్దలు, యాభైమంది మహిళలను బ్యాచ్‌లుగా విభజించి ఉదయం, సాయంత్రం శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం కంపెనీ ఉద్యోగుల నుంచి మూడు నెలలకు రూ.354, ఇతరులకు నెలకు రూ.590, పిల్లలకు నెలకు రూ.150 తీసుకుంటున్నారు. ఈ మేరకు ఫ్రీ స్టైల్, బ్రెస్ట్ స్ట్రోక్, బ్యాక్ స్టైల్, బటర్ ఫ్లై స్టైల్‌లో శిక్షణ కొనసాగుతోంది.

### రాష్ట్ర స్థాయిలో సత్తా చాటారు..



ఆటవిడుపుగా నేర్చుకుంటున్న పలువురు ఆతర్వాత కూడా శిక్షణ కొనసాగించి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ఏటా వేసవిలో స్విమ్మింగ్ శిక్షణ కోసం పలువురు ఆసక్తి కనబరుస్తారు. తద్వారా శారీర దారుఢ్యం సొంతమవుతుంది.

– ఎం.సామ్యేల్, కోచ్

### ఎనిమిది పతకాలు సాధించా..



నేడు ఎనిమిదో ఏట నుంచి స్విమ్మింగ్ శిక్షణకు వస్తున్నారు. ఇప్పటి వరకు నాలుగు ఈవెంట్లలో పాల్గొన్నాను. రాష్ట్ర స్థాయిలో ఎనిమిది పతకాలు సాధించా. ఏనాటికైనా జాతీయ స్థాయి పోటీలు ఎంపిక కావాలనే లక్ష్యంతో నిరంతరం ప్రాక్టీస్ చేస్తున్నా.

– ఛత్రపతి, కొత్తగూడెం

### ఇరవై ఏళ్లుగా శిక్షణ



నేషనల్ స్విమ్మింగ్స్ సెలక్షన్ కమిటీ ద్వారా నేను శిక్షణ పూర్తిచేశా. 2002 నుంచి వేలాది మందికి శిక్షణ ఇచ్చి ఉంటాను. అందులో పలువురు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సింగరేణి సంస్థ అందించిన అవకాశంతో శిక్షణ ఇవ్వగలుగుతున్నా.

– సీహెచ్.సంధ్యారాణి, కోచ్

### శిక్షణ బాగా ఇస్తున్నారు..



పెద్దవారితో సమానంగా పిల్లలు కూడా ఇక్కడ మంచి శిక్షణ ఇస్తున్నారు. మొదట్లో కాస్త కష్టం అనిపించింది. కానీ కోచ్‌లు చెబుతున్న మెళకువలు పాటిస్తే ఈతలో రాణించొచ్చని తెలిసింది. అందుకే శ్రద్ధగా ప్రతీరోజు పూల్‌కు వచ్చి శిక్షణ తీసుకుంటున్నా.

– కె.రిచ్చి, కొత్తగూడెం

## సకాలంలో ఎరువులు అందించాలి



మాట్లాడుతున్న రాంబాబు

పాల్వంచరూరల్: వానాకాలం సీజన్ సమీపిస్తున్న తరుణంలో రైతులకు ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించాలని సీపీఐ ఎంఎల్ (ప్రజాపంథా) జిల్లా నాయకుడు నిమ్మల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బంద్రుగొండ గ్రామంలో శనివారం రైతాంగ, ఉపాధి కూలీల సమస్యలపై జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తొలకరి సీజన్ ప్రారంభం కావస్తున్నందున రైతులకు బ్యాంక్ రుణాలతోపాటు, ఉచితంగా ఎరువులు, విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. రైతులందరికీ పంటబీమా పథకాన్ని వర్తింపజేయాలని, 50 సంవత్సరాలు నిండిన రైతులకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలని, ఉపాధి కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజువారి కూలీ రూ.600 ఇవ్వాలని, పనిప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంట్లు, తాగునీటిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కంటే సురేష్, గోవర్ధన్, నెల్లెల వెంకట్రావు, కంటే ఆదిలక్ష్మి, నిమ్మల నాగేంద్రబాబు, కొలిపాక ప్రవీణ్, వెంపటి బాలాజీ, శాంతి, హేమలత, వసంత, సుభద్ర, రజనీ పాల్గొన్నారు.

## పుస్తకాలు, కూలర్ వితరణ



పోటీ పరీక్షల పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని జిల్లా గ్రంథాలయానికి దాతలు పుస్తకాలే, కూలర్‌ను శనివారం వితరణగా అందజేశారు. గ్రంథాలయంపై ఆధారపడి చదువుకొని పంచాయతీ కార్యదర్శిగా నియమితులైన జి.రవి, లైన్‌మెన్‌గా ఉద్యోగం సాధించిన జి.రాజేష్ సోదరులు రూ.5 వేల విలువ చేసే కూలర్‌ను అందించారు. అదే విధంగా రుద్రంపూర్‌కు చెందిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు ఎస్.ప్రభాకర్ రూ.2వేల విలువ గల పోటీ పరీక్షల పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ మాట్లాడుతూ.. గ్రంథాలయాలను ప్రోత్సహిస్తూ వితరణలు అందించడం అభినందనీయమన్నారు. ఇక్కడ చదువుకొని ఉద్యోగాలు సంపాదించిన వారు పోటీ పరీక్షలకు ఇక్కడకు వచ్చి చదువుకునే వారి సౌకర్యార్థం కూలర్ అందించి కృతజ్ఞతా భావాన్ని చాటుకోవటం గర్వకారణమన్నారు. అధ్యాపక వృత్తిలో ఉండి చదువుల విలువ తెలిసి నేటి యువతరం భవిష్యత్‌లో ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని పోటీ పరీక్షల పుస్తకాలను అందజేయడం అభినందనీయమన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధపడే వారు సైతం వితరణలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌లో స్థిరపడి వారి వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం దాతలు చేసిన వితరణను గ్రంథపాలకురాలు జి.మణిమృదులకు దిండిగల రాజేందర్‌కు అప్పగించారు.

## దూరవిద్య అభ్యర్థులను అనుమతించండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): దూరవిద్య ద్వారా పీజీ చేసిన అంతర్గత ఉద్యోగులకు సింగరేణి ఎక్స్‌టర్నల్ వెల్ఫేర్ ఆఫీసర్ నియామకాలలో అనుమతించాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు రజాక్‌కు శనివారం టీబీజీకేఎస్ ఎస్అండ్‌పీసీ ఫిట్ సెక్రటరీ సుద్దాల నరసింగం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అధినాయకత్వంతో చర్చించి డైరెక్టర్ల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని రజాక్ హామీ ఇచ్చారు. రీజినల్ సెక్రటరీ కూసన వీరభద్రం, పీవీకే 5 ఇంక్లైన్ పిట్ సెక్రటరీ చిలక రాజయ్య, పోషం, శ్రీను, రాజశేఖర్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల కలయిక



సెయింట్ జోసఫ్ హైస్కూల్‌లో 1999-2000 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

కొత్తగూడెంటౌన్: స్నేహితులంతా 23 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలకు గుర్తు చేసుకుంటూ రోజంతా ఉత్సాహంగా గడిపారు. దీనికి రుద్రంపూర్‌లోని సెయింట్ జోసఫ్ పాఠశాల వేదిక అయింది. 1999–2000 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న 34 మంది విద్యార్థులు శనివారం పాఠశాలలో కలుసుకున్నారు. జీవితాలను వర్ణించుకుంటూ పోతే ముగింపే ఉండదు. అదే ఇక్కడ జరిగింది. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ విషయాలు, ఉద్యోగాల గురించి మాట్లాడుకుంటూ మైమరిచిపోయారు. రక్త సంబంధాల కంటే స్నేహ బంధం వీడదీయలేనిదని చాటిచెప్పుకున్నారు. ప్రతి సంవత్సరం ఇలాగే కలుసుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. కరిగిపోయే కాలంలో చెదిరిపోని మధురస్మృతులకు ప్రతిబింబంగా ఈనాటి తీపి జ్ఞాపకాలను కెమెరాలలో బంధించి మురిసిపోయారు. సహపంక్తి భోజనాలు చేసి బైబై చెప్పుకుని ఇళ్లకు బయలుదేరారు.

### ప్రజల అభిప్రాయం సేకరించాలి..



మాట్లాడుతున్న వంశీ

ఇల్లెందు: పట్టణంలో నాభిశిల ప్రతిష్ఠాపనపై ప్రజల అభిప్రాయం సేకరించాలని వివిధ పార్టీల నాయకులు సూచించారు. పట్టణంలోని రాందేవ్‌బాబా ఆలయంలో శనివారం కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, టీడీపీ, ప్రజాపంథా, ఎన్‌డీ నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలల ప్రారంభమయ్యే సమయాన ప్రజలకు ఖర్చులు ఉంటాయనే విషయాన్ని గుర్తించి బొడ్రాయి ప్రతిష్ఠాపనకు అందరికీ వీలయ్యే సమయాన్ని నిర్ణయించాలని సూచించారు. ముద్రగడ వంశీ, బంధం నాగయ్య, ఎస్ఏ.నబీ, సుదర్శన్ కోరీ, బోగ నందకిషోర్, ఈసం నర్సింహరావు, కున్సోత్ రాము, సత్యనారాయణ, బోళ్ల సాగర్, మహేష్, జగన్నాథం పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఇల్లెందురూరల్: అండర్–16 రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టుకు మండలంలోని నిజాంపేట గ్రామానికి చెందిన బత్తిని విశ్వతేజ ఎంపికయ్యాడు. జిల్లా జట్టు ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 260 మంది హాజరు కాగా 12 మందిని ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు విశ్వతేజ ఎంపిక పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

### మా గోడు ఆలకించండి..



ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

జూలూరుపాడు: డబుల్ బెడ్ రూం ఇళ్లు అప్పగించాలని డిమాండ్ చేస్తూ పాపకొల్లు గ్రామ పంచాయతీ భీమ్లా తండాలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాల ఎదుట మండుటెండలో శనివారం గిరిజన మహిళా లబ్ధిదారులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. 12 రోజులుగా నిరహార దీక్ష చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాకు కేటాయించిన ఇళ్లను మాకే అప్పగించాలని కోరారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మండుతున్న ఎండలోనే ఆందోళన కొనసాగించారు. ఆ తరువాత ఎండ తీవ్రతకు తాళలేక లబ్ధిదారులు ఆందోళన విరమించి ఇళ్లకు వెళ్లిపోయారు.

### నిరుద్యోగ మార్చ్‌కు తరలిన బీజేపీ శ్రేణులు

పాల్వంచరూరల్: ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగిన నిరుద్యోగ మార్చ్‌కు పాల్వంచ నుంచి భారతీయ జనతా పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, తదితర నాయకులు, కార్యకర్తలు శనివారం వాహనాల్లో తరలివెళ్లారు.

## బీటీ3 విత్తనాలు అమ్మితే చర్యలు



మాట్లాడుతున్న ఏడీఏ వాసవీరాణి

టేకులపల్లి: నిషేధిత బీటీ3 విత్తనాలు ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని, ఎవరికైనా ఈ విషయం తెలిస్తే వెంటనే పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని వ్యవసాయ శాఖ ఏడీఏ వాసవీరాణి, సీఐ ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డులోని రైతువేదికలో టేకులపల్లి మండలానికి చెందిన విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. ఎవరైనా విత్తన విక్రయదారులు రాత్రివేళల్లో గ్రామాల్లో తిరుగుతూ అమ్మినట్లయితే వెంటనే పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. విత్తన కొనుగోళ్లలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఖచ్చితంగా కొనుగోళ్లపై రశీదు తీసుకోవాలని, విత్తన రకం, లాట్ నెంబర్, జీఓటీ టెస్టులో పొందుపరిచి ఇచ్చారో లేదో తెలుసుకుని కొనాలని సూచించారు. రైతులు దుకాణదారులను ఎంతో నమ్ముతారని, వారి నమ్మకాన్ని ఒమ్ము చేయవద్దన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడి నకిలీ విత్తనాలు విక్రయిస్తే సహించేది లేదన్నారు. లైసెన్స్ లేకుండా దుకాణాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. షాప్ పేరు, డోర్ నెంబర్ పెద్దగా అందరికీ కనిపించేలా రాయించాలని, విత్తన లైసెన్స్ కొనుగోలుదారులకు కనిపించేలా పెట్టాలని, అనుమతి ఉన్న కంపెనీ నుంచి మాత్రమే విత్తనాలు తెచ్చుకోవాలని, బ్లాక్ మార్కెటింగ్ చేయొద్దని హెచ్చరించారు. ఎస్ఐ రమణారెడ్డి, ఏఓ నీరుడు అన్నపూర్ణ, ఏఈఓ శ్రావణి, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

## పట్టాలు ఇవ్వకపోతే పోరు తప్పదు..

టేకులపల్లి: సీఎం అసెంబ్లీలో చెప్పినట్లుగా 11.50లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వాల్సిందేనని, అలా కాకుండా నాలుగు లక్షల ఎకరాలకే పరిమితం చేయడం సరికాదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోడు సాగు చేస్తున్న అందరికీ పట్టాలు ఇవ్వకపోతే మరో ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు. ఎన్నికల వేళ ప్రజలను మభ్యపెట్టాలనే యత్నాలు మాని అందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## రాజ్యాంగ పరిరక్షణే అజెండాగా ప్రజాగర్జన



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: జూన్ 4న జిల్లా కేంద్రం కొత్తగూడెంలో జరగనున్న సీపీఐ ప్రజాగర్జన సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్ర నరేంద్రకుమార్ పిలుపునిచ్చారు. శనివారం జూలూరుపాడులో పార్టీ పార్టీ మండల సమితి ఆధ్వర్యంలో ప్రజాగర్జన సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీఐ లక్ష మందితో ప్రజాగర్జన సభను నిర్వహిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైనట్లు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించి, అంబానీ, అదానీలను మరింత ధనవంతులుగా చేశారన్నారు. అదేవిధంగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసి ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ప్రజాసమస్యల పరిష్కారం, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, పోడు సాగుదారులకు పట్టాలు, రాజ్యాంగ, లౌకిక వ్యవస్థల పరిరక్షణే అజెండాగా ప్రజాగర్జన సభను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కె నాగుల్‌మీరా, చింతా స్వరాజ్ రావు, వీరభద్రం, పత్తిపాటి మహేష్ పాల్గొన్నారు.

## వీఓఏలది వెట్టిచాకిరీ..




టేకులపల్లిలో సమ్మె చేస్తున్న వీఓఏలు

టేకులపల్లి: ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఈ మేరకు శనివారంకు సమ్మె 41వ రోజుకు చేరింది. నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణలో ఐకేపీ వీఓఏలు వెట్టిచాకిరీ చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాపితంగా వీఓఏల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా సమ్మె చేస్తున్నామని తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, సెర్ప్ నుంచి ఐడీ కార్డులు ఇవ్వాలని, గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతీనెల వేతనాలు వీఓఏల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని, ఆన్‌లైన్ పనులు చేయించకూడదని, అర్హులైన వీఓఏలను సీసీలుగా ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మూడ్ చరణ్, మండల అధ్యక్షురాలు చంద్రకళ, గౌసియా, జయ, నాగమణి, స్వప్న, కావేరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## క్విజ్ కాంపిటేషన్‌లో పాల్గొనండి

జూలూరుపాడు: రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీని యువత సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ సభ్యుడు ధరావత్ రామ్మూర్తి నాయక్ అన్నారు. శనివారం మండలంలోని పాపకొల్లులో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐసీసీ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ అధ్యక్షతన నిర్వహించిన హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చేపట్టిన రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటేషన్‌లో యువతీ, యువకులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. 16 సంవత్సరాల నుంచి 35 లోపు ఉన్నవారు జూన్ 17వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. జూన్ 18న ఆన్‌లైన్ పరీక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో నున్నా కృష్ణయ్య, బానోత్ నవీన్ రాథోడ్, కొమ్మినేని రాంబాబు, వాంకుడోత్ కిషన్ నాయక్, గుగులోత్ శ్రీనివాసరావు, కొమ్ము రవి, ఆదినారాయణ, పోగుల శ్రీను, బాదావత్ సామ్యా నాయక్, లక్ష్మణ్, నరసింహారావు, నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

## 5, 6వ తేదీల్లో పీవైఎల్ రాష్ట్ర మహాసభలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర రెండో మహాసభలు వచ్చేనెల 5, 6వ తేదీల్లో ఖమ్మంలో జరగనున్నాయని కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి నోముల భానుచందర్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మహాసభల పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ, ఇంటికో ఉద్యోగం కల్పిస్తానన్న కేసీఆర్ నిరుద్యోగ యువత జీవితాలతో ఆటలాడుకుంటున్నారని ఆరోపించారు. తద్వారా నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఇవన్నీ పాలకుల హత్యలేనని విమర్శించారు. పాలకుల తీరుపై చర్చించడంతో పాటు ఉద్యమ కారాచరణ రూపొందించనున్న మహాసభలకు తరలివచ్చి విజయవంతం చేయాలని భానుచందర్ కోరారు. తోటకూరి సతీష్, భూక్యా లక్ష్మణ్, బానోత్ క్రాంతి, భూక్యా శివ, పి.శ్రీరాం, భద్రు, కిషన్, నితిన్ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఖమ్మం పట్టణంలో నిర్వహించే పీవైఎల్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం రాష్ట్ర కార్యదర్శి మోకాళ్ల రమేష్ ఆధ్వర్యంలో మసివాగు గ్రామంలో ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగావకాశాలను కల్పించడంలో విఫలమయ్యాయన్నారు. కిన్నెర గోపాల్, లాలయ్య, మల్లయ్య, అనిల్ పాల్గొన్నారు.

### అటెన్షన్ ప్లీజ్

## ప్రమాదకరంగా విద్యుత్ తీగలు..

టేకులపల్లి మండలం బద్దుతండా పంచాయతీ మద్దిరాల తండా ప్రాథమిక పాఠశాలలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ పాఠశాల ఆవరణలోనే అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల రెండూ కొనసాగుతున్నాయి. ఈ భవనాలను ఆనుకుని 11 కేవీ విద్యుత్ తీగలు ఉన్నాయి. వీటికి అతి సమీపంలోనే పెద్దపెద్ద చెట్లు కూడా ఉన్నాయి. భారీగా ఈదురు గాలులు వస్తే చెట్లు విరిగి తీగలపై పడే ప్రమాదం ఉంది. అంగన్‌వాడీ పిల్లలు, పాఠశాల విద్యార్థులు తిరుగాడే ఆవరణం కావడంతో ప్రమాదం పొంచి ఉంది. పాఠశాలలు ప్రారంభం కాకముందే విద్యుత్ తీగల వల్ల ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : హట్కర్ దేవా, ఏఈ, విద్యుత్ శాఖ, టేకులపల్లి
సెల్ నెంబర్: 9440811562